

నేడు జీహెచ్‌ఎంల పదోన్నతికి వెబ్ ఆప్షన్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఈ నెల నేడు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్ల నుంచి వెబ్ ఆప్షన్లు తీసుకోనున్నారు. షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల తుది సీనియారిటీ జాబితా బుధవారం విడుదలవుతుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.



చౌటకూర్ మండల పరిషత్ కార్యాలయం

చౌటకూర్ మండల సిబ్బంది సస్పెన్షన్

పుల్‌కల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈమేరకు జడ్పీ సీఈవో కె.జానకిరెడ్డి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఈ నెల 1న ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ ఎల్ ప్రీతంనాయక్, ఆఫీస్ సబార్డినేట్ ఎండీ హైదర్‌అలీ విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. సెలవు పెట్టకుండా, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టడాన్ని సీరియస్‌గా పరిగణించిన జడ్పీ హాజరు రిజిస్టర్‌లో వారిద్దరికీ అబ్సెంట్ వేశారు. నాలుగు రోజుల అనంతరం వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ ప్రీతంనాయక్ సదాశివపేట ఎంపీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా కొనసాగుతుండగా, హైదర్ అలీ పుల్కల్ ఎంపీపీ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన చౌటకూర్ మండల పరిషత్ కార్యాలయానికి కేడర్ స్ట్రెంత్ కేటాయించకపోవడంతో వీరిద్దరినీ డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు.

సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు ఎంఈవోలకు షోకాజ్‌లు

కలెక్టర్ ఆదేశాలతో డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన అవకతవకలపై సీరియస్‌గా ఉన్న కలెక్టర్ చర్యలకు ఆదేశించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయి నుంచి తప్పుడు సమాచారం ఇచ్చిన ముగ్గురు ఎంఈవోల వ్యవహారాన్ని కలెక్టర్ ప్రావీణ్య సీరియస్‌గా తీసుకున్నారు. ఈమేరకు హత్నూర, మునిపల్లి, జహీరాబాద్ మండల విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డీఈవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో ఆ ముగ్గురికి మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు వెలువరించారు. మూడు రోజుల్లో నోటీసులకు వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గొర్రెల లెక్క తేలుస్తారా?

ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్రమాలపై ఫోకస్
దళారులు, అధికారులపై విచారణ షురూ
ఈడీ చేతికి అక్రమార్కుల చిట్టా
మెతుకుసీమలో 51,360 మంది లబ్ధిదారులు
రెండో విడతకు బ్రేక్.. డీడీలు వాపస్

ఉమ్మడి మెదక్ జిల్లాలో గొల్లకుర్మలు ఎందరున్నారు? గత ప్రభుత్వ హయాంలో వీరిలో ఎంతమందికి గొర్రెలు పంపిణీ చేశారు? పంపిణీ చేసిన గొర్రెలు ఇప్పుడు ఉన్నాయా.. లేవా? ఇతర జిల్లాల నుంచి తెచ్చిన గొర్రెలు వీరి వద్ద ఉన్నాయా.. లేక అదేరోజు రీసైక్లింగ్ చేశారా? గొర్రెల కోసం డీడీలు కట్టినవారికి జీవాలు పంపిణీ చేశారా.. లేదంటే డీడీ డబ్బులు తిరిగి ఇచ్చేశారా? లబ్ధిదారులకు గొర్రెలు ఇచ్చే క్రమంలో ఏయే అధికారుల భాగస్వామ్యం ఉంది? ఏయే దళారుల వద్ద కొనుగోలు చేశారు? అనే ప్రశ్నలపై విచారణ మొదలవుతున్నది. గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగాయన్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' కథనం..





సంగారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెక్కాడితే గాని డొక్కాడని గొల్లకుర్మల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టారు. సిద్దిపేట జిల్లా కొండపాక కేంద్రంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. సొసైటీల్లో నమోదైన గొల్లకుర్మల పేర్ల ఆధారంగా రెండు దశల్లో వారికి గొర్రెలు పంపిణీ చేయాలని భావించారు. యూనిట్ మొత్తంలో 25 శాతం మొత్తాన్ని లబ్ధిదారులు డీడీ రూపంలో చెల్లిస్తే, మిగిలిన 75 శాతం ప్రభుత్వం సమకూర్చింది. ఒక్కో యూనిట్‌లో లబ్ధిదారులకు 20 గొర్రెలు, ఒక పొట్టేలును పంపిణీ చేశారు. తొలివిడతలో గుర్తించిన వారందరికీ యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడతలో కొంతమందికి మాత్రమే అందజేశారు.

ఆ జాబితాలో పలువురి పేర్లు

గొర్రెల పంపిణీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లుగా తేటతెల్లమైంది. లబ్ధిదారులకు ఎంతోకొంత ఆశ చూపించి ఇతర జిల్లాల నుంచి తెచ్చిన గొర్రెలను అధికారుల సహకారంతో దళారులు మళ్లీ విక్రయించడం, కొనుగోలు చేయడంలో నిమగ్నమై రీసైక్లింగ్ దందాకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా లబ్ధిదారులకు చెందాల్సిన ప్రయోజనాలన్నీ పలువురు అధికారులు, దళారులకు చెందాయి. ఇదే విషయం బయటపడడంతో అటు ఏసీబీ ఇటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించారు. సంగారెడ్డి జిల్లాలో పలు అక్రమాలు బయటపడ్డాయి. సిద్దిపేట, మెదక్‌లోనూ పంపిణీ పథకం పక్కదారి పట్టింది. గొర్రెల పంపిణీ పథకంలో భాగస్వాములైన పలువురు ప్రభుత్వ అధికారులు

ఉమ్మడి మెదక్ జిల్లా లబ్ధిదారుల వివరాలు

	తొలి విడత	రెండో విడత
మెదక్	12,998	642
సంగారెడ్డి	19,356	1,422
సిద్దిపేట	15,720	1,222
మొత్తం	48,074	3,286

కొత్తగా కార్లు, ఇళ్లు కొనుగోలు చేసినట్లు విచారణాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల ఆధారంగానే ఎవరెవరి భాగస్వామ్యం ఎంతెంత ఉందనే కోణంలో విచారణకు శ్రీకారం చుడుతున్నారు.

పది లక్షల గొర్రెలు ఏమైనట్లు?

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 51,360 మంది గొల్లకుర్మలకు గొర్రెలు పంపిణీ చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి 21 గొర్రెల చొప్పున పంపిణీ చేస్తే ఆ సంఖ్య దాదాపు 10.78 లక్షలపైనే అవుతున్నది. గొర్రెల పంపిణీ పథకం కంటే ముందు ఉమ్మడి జిల్లాలో ఉన్న గొర్రెల సంఖ్యను పోల్చుతూ ప్రస్తుత సంఖ్యపై దృష్టి పెట్టారు. ఒకవేళ ఆ గొర్రెలను మాంసం విక్రయదారులకు విక్రయించారా.. లేక పంపిణీ సమయంలోనే తిరిగి విక్రయించారా అనే విషయాలపైనా ఆరా తీయనున్నట్లు తెలిసింది. ప్రతీ లబ్ధిదారుడిని క్షేత్రస్థాయిలో విచారిస్తే నిజానిజాలు బయటపడే అవకాశం ఉంటుందని విచారణాధికారులు యోచిస్తున్నారు. ఇందులో లబ్ధిదారులను అధికారులు

మిగతా 7వ పేజీలో


అస్వస్థతకు గురైన కార్మికులను అంబులెన్స్‌లో తరలిస్తున్న వైద్య సిబ్బంది

పరిశ్రమలో గ్యాస్ లీకేజీ

ఎనిమిది మంది కార్మికులకు అస్వస్థత

మనోహరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో కెమికల్ గ్యాస్ లీక్ కావడంతో ఎనిమిది మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలోని శ్రియస్ ల్యాబ్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం ఉదయం జరిగింది. గ్యాస్ లీకవడంతో కార్మికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడ్డారని స్థానికులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పరిశ్రమ సిబ్బంది వారిని అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ లీకేజీని అరికట్టడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశ్రమను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. గ్యాస్ పైపు మార్చే సమయంలో లీక్ అయిందని కార్మికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదని ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

రైతుల సమస్యలపై రేపు బీఆర్ఎస్ మహాధర్నా
మెదక్ ధర్నా చౌక్ వద్ద వేదిక
ఏర్పాట్లు చేస్తున్న నాయకులు 8


ఇస్నాపూర్‌లో ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

సర్కారు జాగా కబ్జా.. రాజకీయ దర్జా

- నిరుపేద కార్మికుల స్థలాలను లాక్కుంటున్న పెద్దలు
- అధికారులకు కనకవర్షం
- మున్సిపల్ సిబ్బంది చేతివాటం
- రూ.15 వేలకు ఇంటి నంబర్లు
- ఇస్నాపూర్‌లో కబ్జాల బాగోతం

పటాన్‌చెరు ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల ఆక్రమణలు, పేదలపై దౌర్జన్యాలు పటాన్‌చెరు నియోజకవర్గంలో ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు వివిధ శాఖల అధికారులు సైతం అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.4.5 లక్షలు వెచ్చించి కొన్న స్థలం..

కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామానికి చెందిన నర్సింహు అనే కూలీ తన 10 గుంటల భూమిని అమ్మి రూ.4.5 లక్షలకు ప్రభుత్వ భూమిని కొనుగోలు చేశాడు. ఇంటి అద్దె భరించలేక ఈ నిర్ణయం తీసుకున్నాడు. అయితే, ఇల్లు కట్టుకునే స్తోమత లేకపోవడంతో ఆ స్థలాన్ని అలాగే వదిలేశాడు. ఇప్పుడు కొందరు వ్యక్తులు ఆ స్థలం తమదంటూ నర్సింహులుపై దౌర్జన్యానికి దిగారు. బాధితుడు ఫిర్యాదు చేయగా పటాన్‌చెరు సీఐ న్యాయం చేస్తానని చెప్పి కేసును ఎస్సైకి అప్పగించారు. అయితే, ఇటువంటి సంఘటనలు పటాన్‌చెరులో నిత్యకృత్యంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు లంచాలకు అలవాటు పడి ఆక్రమణదారులకు సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఇస్నాపూర్‌లో జోరుగా ఆక్రమణలు

పటాన్‌చెరు నియోజకవర్గంలో పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలోని సర్వే నం. 496లో ఉన్న 173.31 ఎకరాల ప్రభుత్వ భూమి పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతోంది. అధికారపార్టీ నాయకుడొకరు రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి

మిగతా 8వ పేజీలో



కనుపాపలే కాటేస్తున్నాయ్
రోజురోజుకు బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు
వరుస ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన
బాధితులకు అండగా భరోసా కేంద్రాలు 7

కూలీల ఆటో బోల్తా..
ఎనిమిది మందికి గాయాలు
అంతా కర్ణాటక వాసులే 6

టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటైనర్
ఐదు వాహనాలు వరుసగా ఢీ
లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్‌కు నరకయాతన 6

హాజరు ఇక పక్కా

మున్సిపాలిటీల్లోనూ ముఖ గుర్తింపుతో ఉద్యోగుల హాజరు నమోదు

- సిబ్బంది డుమ్మాలకు చెక్
- బల్దియాలోని అన్ని విభాగాల్లో నిఘా నేత్రాలు
- కలెక్టర్ ఆదేశాలతో సంగారెడ్డిలో ప్రయోగాత్మకంగా అమలు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించకుండా విధులకు డుమ్మాలు కొట్టే మున్సిపల్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి చెక్ పడింది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపల్ కార్యాలయంలోనూ ముఖ గుర్తింపు హాజరు అమల్లోకి వచ్చింది. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను ప్రారంభించారు.

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ ఫేసియల్ రిగ్నేషన్ హాజరు విధానాన్ని అమలు చేస్తారని సమాచారం. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు మొదట సంగారెడ్డి బల్దియాలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ఈ పురపాలికలో మొత్తం 586 మంది ఉద్యోగులు ఉన్నారు. 103 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 224 మంది పారిశుధ్య కార్మికులు, 125 మంది ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నారు. మిగిలిన 34 మంది పరిపాలన విభాగంలో టౌన్ ప్లానింగ్, అకౌంటెంట్, రెవెన్యూ విభాగాల్లో పనిచేస్తున్నారు. కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, నీటి సరఫరా విభాగంలో పనిచేసే ఉద్యోగులు, రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లతో పాటు పట్టణ ప్రణాళిక విభాగంలో విధులు నిర్వహించే సిబ్బంది హాజరును ఇక నుంచి ముఖ గుర్తింపు ద్వారా నమోదు చేయనున్నారు. జిల్లాలోని మిగిలిన బల్దియాల్లో వేలిముద్రల ఆధారంగా హాజరు నమోదు చేస్తున్నారు. సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్-జోగిపేట, ఆమీన్‌పూర్, గుమ్మడిదల మున్సిపాలిటీలతో పాటు కొత్తగా ఏర్పడిన కోహీర్, ఇంద్రేశం, జిన్నారం, గడ్డపోతారం మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఉద్యోగుల హాజరును ప్రతీ రోజు వేలి ముద్రల ఆధారంగా హాజరు నమోదు చేస్తున్నారు. థంబ్ మిషన్ పనిచేయకపోతే కళ్లను స్కాన్‌చేసి హాజరు వేస్తున్నారు.



సంగారెడ్డి మున్సిపాలిటీలో ముఖ గుర్తింపు ద్వారా హాజరు నమోదు చేస్తున్న ఉద్యోగి

సీసీ కెమెరాల నిఘా

సంగారెడ్డి మున్సిపాలిటీలోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, అకౌంట్ సెక్షన్, ఇంజనీరింగ్ విభాగాలతో పాటు పారిశుధ్యం, ఎస్టాబ్లిష్‌మెంట్, ఇన్‌వార్డు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, కంప్యూటర్ నమోదు విభాగాల్లో నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. ఉద్యోగుల కదలికలపై కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

సర్కారు దవాఖానాల్లో 'ఆబాస్' ఫేస్ బయోమెట్రిక్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధార్ ఆధారిత ఫేస్ బయోమెట్రిక్ హాజరు విధానం (ఆబాస్) మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. నూతన హాజరు విధానాన్ని పక్కాగా అమలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖకు పరిధిలోని విభాగాధిపతులు సర్క్యులర్ జారీ చేశారు. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్‌కు హాజరు అమలు బాధ్యతను అప్పగించారు. కొత్త విధానంలో అన్ని సర్కారు దవాఖానాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రతీరోజు ఉదయం, సాయంత్రం హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతీ ఒక్కరి విధులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఇది పాటించని వైద్యులు, సిబ్బందికి ఆరోగ్య శాఖ కఠిన చర్యలు తీసుకోనున్నది.



హాజరు నమోదుకు రూపొందించిన యాప్

భారీ వర్షం.. పొంగిన వాగులు

నారాయణఖేడ్, జహీరాబాద్‌లో జలమయమైన రహదారులు

నారాయణఖేడ్/జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్, జహీరాబాద్ పట్టణాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. పంట పొలాల్లో నీరు నిలిచింది. ఖేడ్ పట్టణంలోని ప్రధాన రహదారిపై మూడడుగుల మేర వరద నీరు పారింది. లోతట్టు కాలనీల్లోని వరద నీరు చేరింది. మంగళవారం సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారులు పరుగులు తీశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మన్సూర్‌పూర్ వాగు పొంగి ప్రవహించింది.

జహీరాబాద్ పట్టణంలో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లపై మురుగు ప్రవహించింది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని పలు కార్యాలయాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రాంగణం చెరవును తలపించింది. తహసీల్దార్ కార్యాలయం ముంగిట వర్షపు నీరు, మురుగు నిలిచిపోవడంతో పని నిమిత్తం వచ్చిన ప్రజలు ఆఫీసు లోపలికి వెళ్లడానికి ఇబ్బందిపడ్డారు. ఆర్డీవో ఆఫీసు, నిమ్జ్ కార్యాలయం, ఎంఈవో ఆఫీసుల ఎదుట కూడా వర్షపు నీరు నిలిచింది. పట్టణంలోని భవానీమందిర్ వెనక రైల్వే అండర్‌బ్రిడ్జి, హౌసింగ్‌బోర్డుకు అండర్‌బ్రిడ్జిలు నీట మునిగాయి.


జహీరాబాద్‌లో చెరువును తలపిస్తున్న డిగ్రీ కాలేజీ ప్రాంగణం


ఖేడ్ పట్టణంలో రోడ్డుపై వరద నీరు

పెట్రోల్ బంకు నిర్వహణలో 'మహిళా శక్తి'ని చాటాలి

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలే పెట్రోల్ బంకును నడుపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డిలో బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన మహిళా శక్తి పెట్రోల్ బంకును మంగళవారం ఆమె పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఉద్యోగాలు చేయడానికే పరిమితంకాకుండా ఉద్యోగాలను సృష్టించేలా మహిళలు ఎదగడం గర్వకారణమన్నారు. నిబంధనలు పాటిస్తూ అమ్మకాలు పెంచుకునేలా బంకు నిర్వాహకులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఏ సుర్యారావుతో పాటు వివిధ శాఖల అధికారులు, మహిళా శక్తి బంకు సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా శక్తి పెట్రోల్ బంకు సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య





గంజాయి సాగులో మహిళకు జైలు, జరిమానా

జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయిమొక్కలను సాగు చేస్తూ పట్టుబడిన కేసులో మహిళకు 5సంవత్సరాల జైలుశిక్ష, రూ.25వేలు జరిమానా విధించారు. సంగారెడ్డిజిల్లా అదనపు న్యాయ మూర్తి కె.జయంతి మంగళవారం తీర్పును వెల్లడించారని జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2020 సంవత్సరంలో సంగారెడ్డిజిల్లా ఝరాసంగం మండలం ఇస్లాంపూర్‌కు చెందిన బోయిని సావిత్రమ్మ అలియాస్ నాయకుని సావిత్రమ్మ తన పొలంలో 175గంజాయి మొక్కలను సాగుచేస్తున్న క్రమంలో ఎక్సైజ్‌అధి కారులు అప్పట్లో దాడులుచేసి కేసు నమోదుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాకోర్టులో కేసు కొనసాగింది. అందరి వాదనలను విన్న జిల్లా అదనపు జడ్జ్ మంగళవారం తీర్పును వెలువరించారు. నిందితురా లిని రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ సీఐ చెప్పారు.





టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటైనర్

తూప్రాన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి హల్దీవాగు బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఐదు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఓ లారీ డ్రైవర్ వాటి మధ్యలో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. వివరా ల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు 44వ జాతీయ రహదా రిపై వెళ్తున్న టూరిస్టు బస్సును వెనుక వేగంగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. మరో మూడు లారీలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. భారీ ప్రమాదం జరగడంతో హైవే మీదుగా వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపో యాయి. ఈ సంఘటనలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఓ లారీ డ్రైవర్ సుమీర్ సింగ్ (25) వాహనంలో ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. పోలీసులు, వాహన డ్రైవర్లు, అంబులెన్స్ సిబ్బంది బలవంతంగా బయటకు లాగారు. లారీ డ్రైవర్ కాలు నుజ్జునుజ్జయింది. సుమీర్‌సింగ్‌ని అంబులె న్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొని ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ సంఘటన మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలో జరిగింది. నార్సింగ్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు ఇన్నోవా కారులో వెల్దుర్తికి వెళ్తున్నారు. జంగరాయి గ్రామ శివారులోని బీటీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.









ఆటో బోల్తా పలువురికి గాయాలు

● 8మంది దినసరి కూలీలకు గాయాలు


గాయపడిన మహిళా కూలీలను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కోహీర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా కొట్టి పలువురికి గాయాలైన సంఘటన కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామ శివా రులో మంగళవారం ఉదయం జరిగింది. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా శివరాంపూర్‌కు చెందిన 8 మంది దినసరి మహిళా కూలీలు కోహీ ర్‌లో కూలి పని చేసేందుకు వస్తూ ఉండగా బిలాల్‌పూర్ గ్రామం శివా రులో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మహిళా కూలీలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ మహిళ కాలు విరిగింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిం చేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో గాయపడిన మహిళా కూలీలు చాలాసేపు గాయాలతో ఇబ్బంది పడ్డారు. దీంతో స్థాని కులు ప్రైవేటు వాహనాల్లో కోహీర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నలుగురు మహిళా కూలీలను సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మరో నలుగురిని జహీరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి


పుల్‌కల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మోటర్ బైక్ అదుపు తప్పి ఫ్లై ఓవ ర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. మండల కేంద్రమైన చౌటకూర్ వద్ద సంగారెడ్డి-నాందేడ్, ఆకోలా 161 జాతీయ రహదారి పై ఓవర్‌పై జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోర్పోలు గ్రామానికి చెందిన తునికి శివచందర్ (48) అత్తగారి ఊరైన ఆందోలు మండలం తాలెల్మ నుంచి స్వగ్రామానికి మోటారు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోటారు బైక్ ఫ్లై ఓవర్ వద్దకు రాగానే అదుపు తప్పి రెయిలింగ్ గోడను బలంగా ఢీకొ ట్టింది. ఈ సంఘటనలో శివచందర్ తలకు బలమైన గాయాలై అక్కడిక క్కడే మృతి చెందాడు. మృతుడు శివచందర్‌కు భార్య లక్ష్మీ, ఇద్దరు కుమా రులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి జోగిపేట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పుల్కల్ ఎస్సై విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

అనుమానాస్పద స్థితిలో యువకుడి..


తేజ (ఫైల్)

వట్‌పల్లి, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌతపూర్ గ్రామానికి చెందిన బోయిన తేజ (22)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై లవ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతాపూర్ గ్రామానికి చెందిన బోయిని తేజ అతడి స్నేహితుడు సికిందర్ కలిసి చేపలు పట్టేందుకు మండలంలోని దుర్గమ్మ వాగుకు వెళ్లారు. సికిందర్ ఇంటికి వచ్చాడు. కానీ తేజ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తేజ తండ్రి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై లవ్ కుమార్ తెలిపారు మంగళవారం దుర్గమ్మ వాగులో శవం కనిపించినట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతి చెందింది తేజ అని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు





కనుపాపలే కాటేస్తున్నాయ్

రోజురోజుకు బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు

- వరుస ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన
- బాధితులకు అండగా భరోసా కేంద్రాలు

" సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న బాలికపై ఇంగ్లీష్ టీచర్ వినయ్ ఆగస్టు 4న లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళనతో పోలీసులు వినయ్‌ను అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఇదే పాఠశాలలో ఇలాంటి ఘటన జరగడంతో అప్పట్లో పోలీసులు నిందితుడిని అరెస్ట్‌చేశారు.

నారాయణఖేడ్ బీసీ బాలికల హాస్టల్‌లో జూలై 22న వార్డెన్ కుమారుడు, మాజీ కౌన్సిలర్ రాజేష్ చౌహాన్ విద్యార్థినులను వేధించాడు. బాలికల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆందోళనతో పోలీసులు అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. "

ఇలాంటి ఘటనలు సంగారెడ్డి జిల్లాలో నిత్యాకృత్యంగా మారాయి. కంటికి రెప్పలా కాపాడాకోవాల్సినవారు, విద్యాబుద్ధులు నేర్పేవారే గతి తప్పి తప్పటడుగులు వేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది.



జిల్లాలో అత్యాచార ఘటనలిలా..

2022	77
2023	100
2024	131
2025(జూన్)	53

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణ కోసం అనేక చట్టాలున్నప్పటికీ కీచకుల ఆరాచకాలు మాత్రం ఆగడం లేదు. ఏటా బాలికలపై అత్యాచారాలు, లైంగిక దాడులు పెరుగుతూనే ఉన్నాయి. ఇది వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతేడాది జిల్లాలో మహిళలపై 131 అత్యాచార కేసులు నమోదయ్యాయి. అలాగే 168 పోక్సో కేసులు నమోదు కాగా 23 మంది బాలికలపై అత్యాచార కేసులు నమోదయ్యాయి.

స్మార్ట్‌ఫోన్ల ప్రభావంతోనే...

చట్టాలు సక్రమంగా అమలై నిందితులకు శిక్షలు పడితేనే బాలికలపై లైంగిక వేదింపులు, అత్యాచార ఘటనలు అరికట్టేందుకు అవకాశం వుంటుందని పలు ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. బాలికల రక్షణ కోసం పోక్సో, నిర్భయ వంటి చట్టాలు ఉన్నప్పటికీ నిందితుల్లో భయం లేని కారణంగానే దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నేడు ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్ అనివార్యంగా మారింది. ఆన్‌లైన్ క్లాసలంటూ వాడకంతో యువత చెడుమార్గంలోకి వెళ్తోంది. ఇంటర్‌నెట్‌లో అవసరమైన దాని కంటే అనవసరమైన వీడియోలు, పోర్న్ వీడియోలు వంటివి వీక్షిస్తున్నారు. దీంతో కొందరు చెడు మార్గాన్ని అనుసరించి ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారు. స్మార్ట్‌ఫోన్ వాడుతున్న పిల్లలపై తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. స్మార్ట్‌ఫోన్‌లలో ఆన్‌లైన్ తరగతులే వింటున్నారా? లేక ఇంకేమైనా వీడియోలు చూస్తున్నారా? అనే విషయాలపై నిఘా పెట్టాలి. తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా కూడా కొందరు పిల్లలు తప్పుదారి పట్టే ప్రమాదం లేకపోలేదు.

చట్టాలపై అవగాహన అవసరం

బాలికల రక్షణ కోసం ఏర్పాటైన చట్టాలపై న్యాయ సేవాధికార సంస్థ ఆధర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చట్టాలు ఉంటాయని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే సెక్షన్ 354 ప్రకారం ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని, చిన్న పిల్లలను లైంగికంగా వేధిస్తే ప్రివెన్షన్ యాక్టు ఫర్ చిల్డ్రెన్ సెక్స్యువల్ అఫెన్సెస్ (పోక్సో) కింద కేసులుంటాయని వివరిస్తున్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే దాడులు అరికట్టే అవకాశం ఉంటుంది.

నిర్భయంగా ఫిర్యాదు చేస్తేనే దోషులకు శిక్ష..

తమకు జరిగిన అన్యాయం గురించి నిర్భయంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. న్యాయస్థానం ముందు దోషులకు శిక్ష పడుతుంది. అప్పుడే తిరిగి నేరం చేయడానికి వెనకడుగు వేస్తారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు అండగా భరోసా కేంద్రం పనిచేస్తుంది. బాలికలపై,మహిళలకు నూతన చట్టాల అవగాహన కోసం జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మహిళలకు రక్షణ కల్పించడానికి జిల్లా పోలీసులు 24/7 అందుబాటులో ఉంటారు.

\- పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ

బాధితులకు కొండంత 'భరోసా'

మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను దృష్టిలో ఉంచుకొని, అన్ని రకాల సేవలను ఒకే గొడుగు కింద అందించాలన్న సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో భరోసా కేంద్రాన్ని 28 సెప్టెంబరు 2020న ప్రారంభించారు. ఈ భరోసాలో శిక్షణ పొందిన సిబ్బంది, భాదిత మహిళలను అక్కున చేర్చుకొని వారిలో కొండంత ధైర్యాన్ని నింపుతున్నారు. బాధితులకు అన్ని రకాల సేవలు (మెడికల్, లీగల్, పరిహారం) ఒకే వేదికగా అందిస్తూ, వారికి బాధ నుండి విముక్తి కల్పిస్తూ సత్వర న్యాయం చేకూరేలా సేవలందిస్తున్నారు. అలాగే భరోసా సెంటర్ ద్వారా పోక్సో, మహిళల పై అత్యాచార కేసులను నియంత్రించడానికి పాఠశాలలు, కళాశాలల్లో తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోక్సో కేసు నమోదు అయినప్పటి నుంచి చివరి వరకు బాధితులకు అండగా ఉంటూ, నేరస్తులకు శిక్ష పడేలా చేయడమే భరోసా సిబ్బంది పాటు పడుతున్నారు.



తంగళ్లపల్లి కస్తూర్బాలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కృష్ణారావు

'నాణ్యమైన విద్యా బోధన చేయాలి'

కోహెడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి అనుగుణంగానే నాణ్యమైన విద్యాబోధన జరగాలని తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం అధిపతి (ఎస్ఎస్‌సీ బోర్డు), జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. శనిగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును పరిశీలించిన కృష్ణారావు, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలల్లో బోధనా విధానాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రంగనాథ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎం. సరళ, ప్రధానోపాధ్యాయులు కన్యాకుమారి, కేజీబీవీ ప్రత్యేక అధికారి వై. హిమబిందు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● యూఎస్‌పీసీ రాష్ట్ర కమిటీ



కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, వై. అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని తిరిగి అమలు చేయాలని, పీఆర్‌సీ నివేదికను వెంటనే బహిర్గతం చేసి చర్చల ద్వారా ఆమోదయోగ్యమైన పీఆర్‌సీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, లక్ష్మయ్య యాదవ్, అశోక్, సోమశేఖర్, సాయిలు, రాంచందర్, సువర్ణ, కాశీనాథ్, నాజర్‌పటేల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి శిక్షణకు చిన్నబ్రహ్మం



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న టీచర్ చిన్నబ్రహ్మయ్య

మర్కూక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట్రాములు తెలిపారు. గతేడాది మర్రి చెన్నారెడ్డి మానవ హక్కుల భవనంలో నిర్వహించిన ప్రదర్శనలో తన ఉత్తమ బోధన పద్ధతులకు గాను ఆయన ఈ అవకాశం పొందారు. ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 2 వరకు 20 రోజుల పాటు ఢిల్లీలోని సీసీఆర్టీ భవన్‌లో జరిగే నూతన విద్యా విధానంపై వర్క్‌షాప్, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు అప్పగించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు చుక్కరాములు

జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణ సమీపంలోని హోతి(కే) శివారులో నిర్మించిన 660 డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అప్పగించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామని చెప్పి అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే లబ్ధిదారులే నేరుగా తాళాలు పగలగొట్టి ఇళ్లల్లోకి వెళ్తారని హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దార్ దశరథ స్పందిస్తూ, ఈ నెల 13న ఇళ్లు అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయరాజ్, మైపాల్, రాంచందర్, రాజిరెడ్డి, ముతబీర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి



పున్నవ్వ (ఫైల్)

దౌల్తాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాత్రూంలో లైట్ వేయబోయి విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పోసానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పోసానిపల్లికి చెందిన పున్నవ్వ(51) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు కొడుకులు, ఒక కూతురితో జీవనం సాగిస్తున్నారు. ఆమె భర్త నర్సింహులు ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. సోమవారం రాత్రి 10 గంటలకు పున్నవ్వ బాత్రూంకు వెళ్తూ లైట్ స్విచ్ వేయబోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. ఇంట్లో ఉన్న పెద్ద కుమారుడు బయటకు వచ్చి చూసేసరికి ఆమె కిందపడి ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అరుణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. పున్నవ్వ పెద్ద కుమారుడు కనకరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

- అత్తగారి ఇంటిపై మృతురాలి బంధువుల దాడి
- భారీగా మోహరించిన పోలీసులు

శివ్వంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చండీ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఎలకంటి గ్రామానికి చెందిన నాగరాణి(26)కి ఐదు సంవత్సరాల క్రితం చండీ గ్రామానికి చెందిన కుమ్మరి దాచారం సత్యనారాయణతో వివాహం జరిగింది. మంగళవారం భోజనం విషయంలో నాగరాణికి ఆమె అత్తకు గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన నాగరాణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. నాగరాణి బంధువులు ఈ విషయం తెలుసుకుని డీసీఎంలో పెద్ద ఎత్తున చండీ గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంధువులు నాగరాణి అత్తగారి ఇంటిపై రాళ్లతో దాడి చేసి, ఇంటి పెంకులు, రేకులు, టీవీ తదితర వస్తువులను ధ్వంసం చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న తూప్రాన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు.

షేర్ మార్కెట్‌లో నష్టాలతో యువకుడు..



దయాకర్ (ఫైల్)

మిరుదొడ్డి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్ (ఆన్‌లైన్ ట్రేడింగ్)లో నష్టాలు రావడంతో మానసికంగా కుంగిపోయిన ఓ యువకుడు ఉరి వేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో మంగళవారం జరిగింది. ఎస్సై సమతా కథనం ప్రకారం.. మిరుదొడ్డి గ్రామానికి చెందిన పయ్యావుల దయాకర్(29) డిగ్రీ వరకు చదివాడు. ఆరేళ్లుగా షేర్ మార్కెట్‌లో ట్రేడింగ్ చేస్తున్నాడు. ఇందులో రూ. 6 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మానసికంగా కుంగిపోయిన దయాకర్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. తల్లి వచ్చి చూడగా, అప్పటికే చనిపోయి ఉన్నాడు. ఏడాది క్రితమే దయాకర్ తండ్రి చనిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, కల్చరల్/మెదక్ మున్సిపాలిటీ/చిన్నశంకరంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం ఆయన చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్వాక్రా మహిళా సంఘాలు బ్యాంకు రుణాలను తీసుకొని, వివిధ రంగాల్లో వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే వడ్డీ లేని రుణాల కింద 7,668 యూనిట్లు నెలకొల్పారని తెలిపారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి సంస్థల క్రమబద్ధీకరణ పథకం కింద కూడా 150 యూనిట్లు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని వివరించారు. ఈ పథకం కింద రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని, ఇందులో 70 శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే, 30 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయన మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరాపురి కాలనీలో పర్యటించారు. ప్రజల ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా లేకపోవడాన్ని గమనించి, వారికి అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద టైర్లు, కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.



చిన్నశంకరంపేటలోని ఓ జనరల్ స్టోర్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు రాఖీ అందిస్తున్న మహిళ

చదువుల తల్లికి అండగా.. యాదాద్రి కలెక్టర్

● ఉన్నత చదువులు చదివిస్తానని హామీ



కలెక్టర్ హనుమంతరావు సన్మానిస్తున్న దృశ్యం

మర్కూక్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆమె ఐదో తరగతిలో ఉండగా.. ఆయన అక్కడ ప్రత్యేకాధికారి. అప్పట్లో ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఆయన తాను ఎక్కడ ఉన్న విద్యార్థి చదువులకు అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఇప్పుడాయన యాదాద్రి భువనగిరి కలెక్టర్. ఆమె ఇప్పుడు ఇంటర్‌లో వెయ్యికి 992 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక భరోసా కోసం అప్పుడు మాట ఇచ్చిన.. ఇప్పటి యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావును కలిసింది. ఆయన ఆమె చదువులకు అయ్యే ఖర్చులన్నింటినీ భరిస్తానని మాట ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు సిద్దిపేట లాల్లా గజ్వేల్ ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలో మర్కుక్ మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల మూతపడే దశకు చేరుకుందని తెలుసుకున్నారు. ఊరి వాళ్లతో మాట్లాడి పిల్లలు బడికి వచ్చేలా చేసి, ఆ బడిని బతికించారు. అప్పుడు ఆ గ్రామానికి చెందిన బీళ్ల స్వాతిక అనే ఐదో తరగతి విద్యార్థిని ప్రతిభ చూసి అభినందించడంతో పాటు ఆమెకు చదవు విషయంలో అండగా ఉంటానని మాట ఇచ్చారు. ఆయన స్ఫూర్తితో బీళ్ల సాత్విక చదువులో ముందడుగు వేసింది. పదో తరగతిలో పది జీపీఏతో నిలిచింది. ఇంటర్ ఎంపీసీలో వెయ్యికి 992 మార్కులతో రాష్ట్రంలో మూడు స్థానంలో నిలిచింది. మంచి కాలేజీలో ఇంజనీరింగ్ కోర్సు చదివేందుకు సీటు సంపాదించింది. కానీ, ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతే కావడం, ఎప్పుడో మాట ఇచ్చిన అధికారి ఎక్కడ ఉన్నారో వెతికి మంగళవారం వెళ్లి కలిసింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ హనుమంతరావు.. విద్యార్థిని అభినందించడంతో పాటు ఆమె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట గ్రామ మాజీ సర్పంచ్ దుద్దెడ రాములుగౌడ్, పాఠశాల హెచ్ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు చిన్ని కృష, విద్యార్థిని తండ్రి శ్యాంసుందర్ ఉన్నారు.

కుళ్లిన కోడిగుడ్లపై ఐసీడీఎస్ అధికారుల విచారణ

చేర్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నెం.2లో ఇటీవల పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయిన విషయమై ఐసీడీఎస్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డీడబ్ల్యూవో లక్ష్మీకాంతరెడ్డి, సీడీపీవో రమాదేవితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కుళ్లిన గుడ్లు పొందిన లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న గుడ్లను, ఉడకబెట్టిన గుడ్లను పరిశీలించారు. పోషకాహార సరుకుల పంపిణీపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



గొర్రెల లెక్క తేలుస్తారు!

(5వపేజీ తరువాయి)

ఏజంట్లే పక్కదారి పట్టించారనే ఆరోపణలు ప్రధానంగా ఉండడంతో లబ్దిదారులపై సానుకూల ధోరణి చూపించనున్నారు. కొందరు గొర్రెల పెంపకంపై దృష్టిపెట్టగా మెజార్టీ శాతం అప్పటికప్పుడే వారు చెల్లించిన డీడీ డబ్బులకు రెట్టింపు నగదు తీసుకొని విక్రయించారనే ఫిర్యాదులు ఉన్నాయి.

నిలిచిన రెండో విడత

మొదటి విడతలో దాదాపు గొర్రెల పంపిణీ పూర్తికాగా గత ప్రభుత్వ హయాంలోనే రెండో విడత కూడా ప్రారంభించి కొందరికి మాత్రమే పంపిణీ చేశారు. ఇంతలోనే అధికారం తారుమారు కావడంతో ఆ పథకం ఆగిపోయింది. అప్పటికే గొర్రెల పంపిణీపై అనేక ఆరోపణలు వచ్చాయి. మెదక్ జిల్లాకు సంబంధించి రెండో విడతలో 2,584 మంది డీడీలు కట్టగా 1,942 మందికి తిరిగి ఇచ్చేశారు. సంగారెడ్డి జిల్లాలో 5,290 మంది డీడీలు చెల్లించగా 3,829 మంది వాపస్ తీసుకున్నారు. అదే సిద్దిపేట జిల్లాలో 5,357 డీడీలు కట్టగా 4,135 మందికి తిరిగి ఇచ్చేశారు.

ప్రైవేట్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కాపాడే ప్రయత్నం చేసిన ప్రైవేట్ హైస్కూల్ గుర్తింపును రద్దు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ. రహ్మాన్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయం ముందు సీపీఐ నాయకులు స్కూల్ యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. రహ్మాన్ మాట్లాడుతూ, లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌పై నిర్భయ, పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సమతాదల్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు గంగయ్య, పాండు, మహబూబ్, మున్నా, ఆసద్, శ్రీనివాస్, బాబు, జగ్జీవన్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రాతియుగం నాటి కంకణ శిల లభ్యం



నంగునూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట శివారులోని పాటిగడ్డ వద్ద కొత్త రాతియుగం నాటి రాతి పనిముట్టు లభ్యమైంది. ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ మంగళవారం దీన్ని గుర్తించారు. ఇది గుండ్రంగా ఉండి, మధ్యలో రంధ్రం ఉందని శ్రీనివాస్ తెలిపారు. దీనిని 'కంకణ శిల' అని పిలుస్తారని చెప్పారు. ఇది 7 సెం.మీ. ఎత్తు, 5 సెం.మీ. వెడల్పు, 4 సెం.మీ. మందం కలిగి ఉంది. పూర్వ మానవులు బరువులు తూయడానికి ఉపయోగించి ఉండవచ్చని ఆయన తెలిపారు. ఇది కొత్త రాతియుగం చివరి దశ కాలం, అంటే క్రీస్తు పూర్వం 2500 నాటిదని, సుమారు 4500 ఏళ్ల క్రితం నాటిదని శ్రీనివాస్ పేర్కొన్నారు.





హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరంపై నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయం నుంచి వీక్షించారు. అలాగే మెదక్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపులతోనే పాలన కొనసాగిస్తున్నారన్నారు.

\- సంగారెడ్డి రూరల్/మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీ

వట్‌పల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో పాండు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా షాద్నగర్‌లో నిర్వహిస్తున్న భూభారతి సర్వే వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, సర్వేర్ మురళీధర్ ఉన్నారు.

రేపటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలల్లో ఈ నెల 6 నుంచి 28వ తేదీవరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఉదయం 11 గంటలలోపు మెరిట్ ప్రకారం వాక్ ఇన్ అడ్మిషన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

మహిళా ప్రొటెక్షన్ సెల్ చైర్‌పర్సన్‌గా సుశీల

నారాయణఖేడ్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ సంస్థ మహిళా ప్రొటెక్షన్ సెల్ నిజాంపేట మండల చైర్‌పర్సన్‌గా సుశీల నియమితులయ్యారు. మంగళవారం ఖేడ్‌లోని సంస్థ ఏరియా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్‌రహీం ఉత్తర్వులు జారీచేశారు.

అనాథ బాలికను గురుకులంలో చేర్పించిన తహసీల్దార్

నాగల్‌గిద్ద, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కిషన్‌నాయక్‌తండాకు చెందిన అనాథ బాలిక సింధును తహసీల్దార్ స్థానిక కరస్‌గుత్తి గిరిజన బాలికల పాఠశాలలో చేర్పించారు. సింధు తల్లిదండ్రులు జాదవ్ గణపతి, సునీత గతంలో చనిపోయారు. సింధుకు చదువుకోవాలనే ఆసక్తి ఉండడంతో తండావాసులు తహసీల్దార్ శివక్రిష్ణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సింధును గురుకులంలో 6వ తరగతిలో చేర్పించారు.

అనుమతి లేని డ్రైనేజీ నిర్మాణంపై ఫిర్యాదు

జిన్నారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా పరిశ్రమ ముందు డ్రైనేజీ కాలువ నిర్మించారని మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, నాయకులు అర్జున్, నవీన్, మంతయ్య, ఉపేందర్ గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎంఎస్ఎన్ పరిశ్రమ ముందు భాగంలో అనుమతులు లేకుండా డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసి వాటి ద్వారా పరిశ్రమ రసాయన వ్యర్థాలు వదిలేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

సమస్యలను పరిష్కరించాలి

జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్, శ్రీకాంత్, సాయికిరణ్‌గౌడ్, కోటేశ్వర్‌రెడ్డి, పులేందర్ పేర్కొన్నారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, సిటీ స్కానింగ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు డయాలసిస్ యంత్రాలు పెంచి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలి

హవేళిఘణపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) ; అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రాల ఉద్యోగులకు మద్దతుగా ధర్నా నిర్వహించి, తహసీల్దార్ సింధురేణుకకు వినతిపత్రం అందజేశారు.

ప్రీ ప్రైమరీ విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదం

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



పోతిరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబోధనను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న విద్యాబోధన విధానాన్ని ఆమె మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని టీచర్, సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు మెరుగైన ప్రీ ప్రైమరీ విద్య లభిస్తుందన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, పిల్లల భవిష్యత్ మెరుగుపడాలంటే అంగన్‌వాడీ కేంద్రాలపై తల్లిదండ్రులకు నమ్మకం పెంచాలని సూచించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖాధికారి లలితకుమారి, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫోన్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయండి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

● 259 మొబైల్స్ రికవరీ.. అందజేత

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సీఈఐఆర్‌లో ఫిర్యాదు చేసిన 259 మంది సెల్‌ఫోన్లను బాధితులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందజేసి మాట్లాడారు. సెల్‌ఫోన్ రికవరీ కోసం ఐటీ, సైబర్‌సెల్, ఎస్ న్యాట్ సిబ్బంది, స్పెషల్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మన రాష్ట్రంలోనేగాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ ఫోన్లు రికవరీ చేసినట్లు తెలిపారు.

అధిక దిగుబడి వచ్చే పంటలు పండించాలి

● మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్

మనోహరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు దిగుబడి వచ్చే పంటలు పండించాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ సూచించారు. మంగళవారం మనోహరాబాద్ మండలం కూచారం రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి రైతునేస్తం కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి స్రవంతి, యాదగిరి, ఏఈవో సచిన్, నరేందర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

కౌడిపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్



కౌడిపల్లిలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న జిల్లా వ్యవసాయ ధికారి దేవ్‌కుమార్

సాగుతో అధిక లాభాలు పొందొచ్చని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సత్తిరెడ్డి వ్యవసాయ పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి స్వప్నజాదవ్, ఏఈవో సాహితీ, హార్టికల్చర్ ఫీల్డ్ అధికారి మౌనిక తదితరులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ తప్పదు : ఎమ్మెల్యే

కొల్చారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొల్చారంలో ఎస్ఐ మహ్మద్ గౌస్ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 42 ఏళ్లపాటు ప్రజల మధ్య ఉంటూ సేవ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐగా ఎదిగిన గౌస్, విధుల్లో నిబద్ధతగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై రేపు మహాధర్నా



ధర్నా చౌక్ స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టబోతున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఆవరణలోని ధర్నాచౌక్ స్థలాన్ని మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నాయకులతో కలిసి పరిశీలించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వలేదు. రైతు భరోసా, రైతు సమస్యలపై రైతులతో కలిసి ధర్నా చేయనున్నట్లు తెలిపారు. స్థల పరిశీలన చేసిన వారిలో బీఆర్ఎస్ నేతలు లావణ్యారెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, ఆర్‌కె శ్రీనివాస్ ఉన్నారు.

'రైతునేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మడిదల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రైతునేస్తం కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం గుమ్మడిదల రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమం రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణాధికారులు నిఖిత, ప్రణవి పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

కంది, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. కంది మండలంలోని వడ్డెనగూడతండా పరిధిలో గల సర్వే నంబర్ 312 నుంచి 352 సర్వేనంబర్లలో ప్రభుత్వ నక్షబాట గొలుసు కట్టు వెడల్పు తొవ్వబాట ఉన్నది. ఇన్ని రోజులు రైతులు నక్షాదారిని పొలాలకు వెళ్లేందుకు రైతులు ఉపయోగించుకుంటున్నారు. ఇటీవల ఆ నక్షాబాటలోని సర్వే నంబరు 342 నుంచి 354 వరకు కబ్జాకు గురైందని రైతులు ఆరోపించారు. పక్కనే ఉన్న కొందరు భూస్వాములు తమ నక్షాబాటకు ఫెన్సింగ్ వేసి దారిని మూసేశారని తెలిపారు. గతనెల 29న ఆ గ్రామ యువనాయకులు మోతీలాల్‌నాయక్ ఆధ్వర్యంలో రైతులు ఆ నక్షాబాట వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ నక్షాబాటను పరిశీలించి కబ్జాకు గురైందని నిర్ధారణకు వచ్చారు. కబ్జా చేసిన భూస్వాములకు నోటీసులు జారీచేశారు. వెంటనే ఆ ప్రాంతాన్ని సర్వే చేశారు. మంగళవారం తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ కోటేశ్వర్‌రావు, ఆర్ఐ రంగయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్, రైతులు మోతీలాల్‌నాయక్ పోలీసు బలగాలతో వెళ్లి ఎక్స్‌కవేటర్ సహాయంతో నక్షాబాటకు అడ్డంగా వేసిన ఇనుప కంచెను తొలగించారు. ఎట్టకేలకు నక్షాబాటను కబ్జాదారుల చెర నుంచి విడిపించారు.

సర్కారు జాగా కబ్జా.. రాజకీయ దర్జా

(5వ పేజీ తరువాయి)

ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారు. 70-100 గజాల ప్లాట్లుగా విభజించి, ఒక్కో ఇంటిని రూ.15 నుంచి రూ.20 లక్షలకు అమ్ముకుంటున్నారు. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అధికారులు నిర్మాణాలను కూల్చివేశారు. కానీ, కలెక్టర్ ప్రావీణ్యకు ఆక్రమణలు తొలగించామని నివేదిక పంపించి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులతో వాటాదారులుగా మారి నిర్మాణాలు కొనసాగించేందుకు మద్దతు ఇస్తున్నారని విమర్శలున్నాయి. 15 ఏళ్ల క్రితం ఇచ్చిన చెల్లని పట్టాలను సాకుగా చూపి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. మున్సిపల్ సిబ్బంది కూడా ఇళ్ల నంబర్ల కోసం ఒక్కో ఇంటి నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారని సమాచారం.

వలస కూలీలపై కబ్జా రాయుళ్ల దౌర్జన్యాలు

ఇస్నాపూర్‌లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల వలస కూలీలు అద్దె ఇల్లు భరించలేక చిన్న చిన్న స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే, కబ్జారాయుళ్లు ఈ పేద కూలీలను బెదిరించి వారు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన స్థలాలను లాక్కుంటున్నారు. భవిష్యత్తుపై భయంతో ఈ కూలీలు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు కూడా తమకు ఎందుకులే అన్న ధోరణిలో వారికి అండగా ఉండటం లేదని బాధితులు వాపోతున్నారు.

కూలగొట్టాం ఇంకేమీ లేదు

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను ఎప్పటికప్పుడు కూలుస్తున్నాం. మొన్ననే ఆక్రమణలుంటే తొలగించేశాం. ప్రస్తుతం ఎటువంటి ఆక్రమణలు జరగడం లేదు.

\- రంగారావు, పటాన్‌చెరు తహసీల్దార్

తల్లిపాలు అమృతంలాంటివి : లలితకుమారి

సంగారెడ్డి అర్బన్/కోహీర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు అమృతంలాంటివని సంగారెడ్డి జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి లలితకుమారి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరునెలల వరకు తల్లిపాలు పట్టించాలని, ఆ తర్వాత అదనపు పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత, డబ్బాపాల వల్ల కలిగే నష్టాలను బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డా.పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కోహీర్ మండలం మానియార్‌పల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.



తల్లిపాల వారోత్సవాల్లో లలితకుమారి, సిబ్బంది

పార్టీని పటిష్టం చేయడమే ధ్యేయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్/కొల్చారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని గ్రామగ్రామాన బలోపేతం చేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తాచాటడమే ధ్యేయంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆవంచ గ్రామంలో మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామంలో పర్యటించినా ప్రజల నుంచి ఆదరణ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నగేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజేష్, నాయకులు పాల్గొన్నారు. అలాగే కొల్చారం మండలంలోని వర్గం గ్రామంలో మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్ ఇంటింటికి డోర్ స్టిక్కర్ల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు హరీశ్‌పటేల్, నాయకులు వెంకట్, ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.



ఆవంచలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మల్లేశ్‌గౌడ్

లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూలను ఇవ్వాలి

జహీరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని హోతి(కే) శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపికచేసి సర్టిఫికెట్లను అందజేశామన్నారు. అంతలోనే ఎన్నికలు రావడంతో అప్పగింత ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించి అర్హులైన వారందరికీ ఇళ్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టునారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మశ్చేందర్, నాయకులు చిన్నారెడ్డి, మోయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాణిక్‌రావు

ఆధార్ ఆధారిత హాజరు రద్దు చేయాలి

● డీఎంహెచ్‌వోకు 'అబాస్' పోరాట కమిటీ వినతి



ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మలకు వినతిపత్రం అందజేస్తున్న 'అబాస్' పోరాట కమిటీ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఆధార్ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆధార్ ఎనేబుల్డ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (అబాస్) సంగారెడ్డి జిల్లా పోరాట కమిటీ మంగళవారం జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డా.నాగనిర్మలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గుండయ్య, ఈర్న భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖలో ఆధార్ ఆధారిత అటెండెన్స్ విధాన అమలు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీనారాయణ, సుగుణాకర్, మహేల, పురుషోత్తం, శాంత, నాజి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కాలువలు

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్న సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రామచంద్రారెడ్డినగర్ కాలనీలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. రూ.25 లక్షలతో బహిరంగ కాలువల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ సురేష్, ఏఈ దివ్య, రామచంద్రారెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, చంద్రశేఖర్‌గుప్తా, తిరుమలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి'

రామాయంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడే భవిష్యత్‌లో రాణించగలరని లయన్స్ జిల్లా వైస్ గవర్నర్ విజయలక్ష్మి సూచించారు. రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు లైన్స్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ టీవీసీ చారి ఫర్నిచర్ బహూకరించారు. ఈ సమావేశానికి స్థానిక క్లబ్ చైర్మన్ దేమే యాదగిరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారులు విద్యాభ్యాసంలో ఉన్నతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, సుభాష్‌రెడ్డి, లయన్స్ జిల్లా కార్యదర్శి ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, వంగరి కైలాస్, తిరుపతిగౌడ్, అజ్గర్ పాల్గొన్నారు.

భూభారతి సమస్యల పరిష్కారం వేగవంతం చేయండి : ఆర్డీవో

పాపన్నపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : భూభారతిలో రైతుల నుంచి వచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కారం చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. మంగళవారం ఆమె పాపన్నపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతిలో వచ్చిన సమస్యలు వాటి, పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ సతీష్, సిబ్బంది ఉన్నారు.

రైతుల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం

పుల్‌కల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేస్తున్నామని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ కె.అరుణకుమారి తెలిపారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో మంగళవారం రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ నేపథ్యం గల ఓ చిత్రపటాన్ని గీసి రైతులకు అవగాహన కల్పించారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి : ఎంపీడీవో

పుల్‌కల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చౌటకూర్ ఎంపీడీవో కె.శంకర్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రతీరోజు 10 గంటలకు పంచాయతీ కార్యాలయానికి చేరు

భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

జిన్నారం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం, జంగంపేట గ్రామాల్లో హెచ్ఎండీఏ లే అవుట్ కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని జిన్నారం మాజీ సర్పంచ్ వెంకటేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, రైతులు కోరారు. ఈ విషయమై మంగళవారం అదనపు కలెక్టర్ మాధురిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రెండు గ్రామాల్లో 180 ఎకరాల అసైన్డ్ భూములను హెచ్ఎండీఏ లే అవుట్ కోసం సేకరించగా.. స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 600 గజాల చొప్పున పరిహారంగా పట్టాలు అందజేశారని తెలిపారు. తమకు కేటాయించిన పరిహారం భూములకు నేటికీ పొజిషన్లు చూపలేదని, లే అవుట్‌కు సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదని, హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖ తీరుతో తాము నష్టపోతామని తెలిపారు. వెంటనే తమకు కేటాయించిన 600 గజాల స్థలాలకు పొజిషన్లు చూపించి, న్యాయం చేయాలని కోరారు.

గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదు

నర్సాపూర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణ అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 9, 10వ వార్డుల్లో పర్యటించి, మురుగు కాలువల పరిస్థితి, రోడ్లు, ఇతర సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

● డీటీడబ్ల్యూవో నీలిమ



నార్సింగిలో పలు వీధుల్లో పారిశుధ్య పనులను, పాఠశాలలను పరిశీలిస్తున్న నీలిమ

చేగుంట/తూప్రాన్/చిలప్‌చెడ్/నారాయణఖేడ్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి, నార్సింగి మండల ప్రత్యేకాధికారి(డీటీడబ్ల్యూవో) నీలిమ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మండలంలోని నర్సంపల్లి పెద్దతండా, నార్సింగి గ్రామాల్లో పర్యటించి, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను సందర్శించి, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. చేగుంట మండలంలోని రాంపూర్, గొల్లపల్లిలో మండల ప్రత్యేకాధికారి హైమావతి పర్యటించారు. పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో నరేష్, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం డ్రైడే చేపట్టినట్లు కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. వార్డుల్లో ఇంటింటికి తిరిగి వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిలప్‌చెడ్ మండలంలోని చండూరు, చిలప్‌చెడ్ గ్రామాల్లో వీధులను, అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను మండల ప్రత్యేక అధికారి నిత్యానందా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రశాంత్, ఇన్‌చార్జి ఎంపీవో తిరుపతి, కార్యదర్శులు పాల్గొన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా పనులను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు పర్యవేక్షించారు.

ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యమందించాలి : డీఎంహెచ్‌వో

మునిపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగనిర్మల సంబంధిత వైద్యులను ఆదేశించారు. మంగళవారం నాడు మండల కేంద్రమైన మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగనిర్మల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వైద్యుల హాజరు పట్టిక, రికార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ సంధ్యారాణి, పీహెచ్ఎన్ చంద్రభాను, సూపర్ వైజర్స్ విజయలక్ష్మి, ఎస్తేర, ఏఎన్ఎం ప్రియలత తదితరులు ఉన్నారు.